క్లుప్తంగా

కరపత్రాల విడుదల



కరపత్రాలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కర్నూలు(అర్బన్): జాతీయ గిరిజన సాంస్కృతిక మహోత్సవ కరపత్రాలను పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మంగళవారం తన నివాసంలో విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు కులాలకు చెందిన సంప్రదాయాలను ప్రతిబింబింపజేసే ఇలాంటి ఉత్సవాలు జరగాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ చంద్రప్ప మాట్లాడుతూ ఈనెల 28, 29 తేదీలలో పార్వతీపురం జిల్లా సీతంపేట ఐటీడీఏలో ఆదివాసీ గిరిజన సాంస్కృతిక మహోత్సవాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో టీఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామరాజు, పి.వెంకటేష్, ఏఎస్‌ఏ జిల్లా అధ్యక్షుడు మధుక్రిష్ణ, నాయకులు సునీల్ పాల్గొన్నారు.

కరువు సహాయక చర్యలు చేపట్టాలి

కర్నూలు(సెంట్రల్): కరువు సహాయక చర్యలను చేపట్టాలని సీపీఎం ఎంఎల్ ప్రజా పంథా ఉమ్మడి కర్నూలు జిల్లా బాధ్యుడు సి.అనుమంతు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం నీలం రామచంద్రయ్య భవన్‌లో జరిగిన ప్రజాపంథా అనుబంధ సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. కరువు బారిన పడిన రైతులను కేంద్రం ప్రభుత్వం ఆదుకోవడానికి చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలన్నారు. సమావేశంలో నాయకులు ఆశీర్వాదం, అర్లప్ప, రాజేశ్, సామన్న పాల్గొన్నారు.

రజకుల సంరక్షణ కోసం చట్టం తేవాలి



మాట్లాడుతున్న సి.గురుశేఖర్

కర్నూలు(సెంట్రల్): రజకుల సంరక్షణ కోసం అట్రాసిటీ తరహాలో చట్టం తేవాలని ఏపీ రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు సి.గురుశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కేకే భవన్‌లో ఏర్పాటు చేసిన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రజకుల కుటుంబాలకు 250 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇవ్వాలన్నారు. 50 ఏళ్లు నిండిన రజకులకు నెలకు రూ.3 వేల పెన్షన్ ఇవ్వాలన్నారు. జీఓ 59ను సవరించి ఇళ్ల వద్ద రజక వృత్తి చేసుకునే వారికి కూడా జగనన్న చేదోడు పథకాన్ని వర్తింపజేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు జయమ్మ, మల్లికార్జున, అశోక్, చంద్ర, వెంకటరమణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయాన్ని పరిరక్షించండి

కర్నూలు కల్చరల్: ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయాన్ని పరిరక్షించంచాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు కునిగిరి నీలకంఠ డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కౌతాళం మండలంలోని ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయంలో నాలుగేళ్లుగా టెండర్లను పారదర్శకంగా నిర్వహించకుండా ఒకే వ్యక్తికి కట్టబెడుతూ ఆలయ ఆదాయానికి ఆలయ అధికారులు గండి కొడుతున్నారని ఆరోపించారు. కాంట్రాక్టర్ వేలం డబ్బు ఎగ్గొడుతున్నా దేవదాయ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. టెంకాయలు, దర్శనం, తలనీలాలు తదితర వాటికి పారదర్శకంగా టెండర్లు నిర్వహించి ఆలయానికి ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

కరువు మండలాలుగా ప్రకటించాలి

కర్నూలు(సెంట్రల్): కృష్ణగిరి, తుగ్గలిలను కరువు మండలాలుగా ప్రకటించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప, జిల్లా కార్యవర్గ సభ్యుడు నబిరసూల్ డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో ఆయా మండలాల రైతులతో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో అన్ని మండలాలను కరువుగా ప్రటకించి.. అత్యంత తక్కువ వర్షపాతం నమోదైన తుగ్గలి, కృష్ణగిరిలను ప్రకటించకపోవడం అన్యాయమన్నారు. అనంతరం కలెక్టర్ డాక్టర్ జి.సృజనకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో కటారుకొండ, బి.బొంతిరాళ్ల సర్పంచ్‌లు లెనిన్‌బాబు, రవిమోహన్ పాల్గొన్నారు.

సరైన పరిహారం ఇవ్వాలి

కర్నూలు(సెంట్రల్): చెన్నై- సూరత్ నేషనల్ హైవే కోసం భూములు కోల్పోతున్న కర్నూలు మండలం దుద్యాల రైతులకు సరైన పరిహారం ఇవ్వాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం దుద్యాల రైతులతో కలిసి ఆయన కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు. దుద్యాల గ్రామ సమీపంలో ఎకరం రూ.కోటిన్నర వరకు ధర పలుకుతుంటే రూ.7 లక్షలు ఇస్తామని జాతీయ రహదారుల సంస్థ ప్రకటించడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర పాల్గొన్నారు.

జగనన్నతోనే సంక్షేమ పాలన

- 'వై ఏపీ నీడ్స్ జగన్'లో ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్



మాట్లాడుతున్న కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమ పాలన సాధ్యమవుతుందని కర్నూలు ఎమ్మెల్యే ఎంఎం హఫీజ్‌ఖాన్ అన్నారు. మంగళవారం స్థానిక 2వ వార్డు ఎర్రబురుజు, అర్బన్ బ్యాంక్ ప్రాంతంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వం చేసిన, చేస్తున్న మేలును వివరించారు. ఆయా కుటుంబానికి ప్రభుత్వం చేసిన మేలు, చేకూరిన లబ్ధిని తెలియజేశారు. 2014 ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీలు, విస్మరణ, సీఎం జగన్ చెప్పి, చెప్పకుండా అమలు చేసిన పథకాలను వివరించారు. గత, ప్రస్తుత ప్రభుత్వాల పాలనను అర్థమయ్యేలా చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో అవినీతి పెద్ద ఎత్తున జరిగిందని, జన్మభూమి కమిటీల సిఫార్సు ఉన్న వారికే పథకాలు మంజూరు చేసేవారని పేర్కొన్నారు. కానీ జగనన్న పాలనలో అవినీతి రహిత, పారదర్శకవంతమైన పాలన అందిస్తున్నారని, ఎవరి సిఫార్సులు లేకుండా అర్హుల ఖాతాలకే నేరుగా నగదు జమ అవుతుందని వెల్లడించారు. తమ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలతో పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందారని, నాలుగున్నరేళ్ల పాలనతో ప్రజలు సంతోషంగా ఉన్నారని చెప్పారు. పేదలకు మంచి చేస్తుంటే ఓర్వలేని చంద్రబాబు ఎల్లో మీడియాతో కలిసి బురదజల్లేందుకు యత్నిస్తున్నాడన్నారు. ప్రతిపక్షాల అబద్ధాలను తిప్పికొట్టేందుకు ప్రతి కార్యకర్త సిద్ధం కావాలన్నారు. సీఎం జగన్ చెప్పిన ప్రతి హామీ నెరవేర్చారని, దీని వల్ల కలిగిన ప్రయోజనాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో కర్నూలు నియోజకవర్గ పరిశీలకుడు కర్ర హర్షవర్ధన్‌రెడ్డి, వార్డు ఇన్‌చార్జ్ ఫైరోజ్, 4వ కార్పొరేటర్ అర్షియా పర్విన్, నాయకులు ప్రసాద్, హకీమ్, ఎజాజ్, సురేష్, జుబైర్ తదితరులు పాల్గొన్నారు.

ఖబరస్తాన్‌లో మౌలిక సదుపాయాలు

కర్నూలు(రాజ్‌విహార్): ఖబరస్తాన్ (శ్మశాన వాటిక)లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు చేపట్టినట్లు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ తెలిపారు. మంగళవారం ఆయన 6వ వార్డులోని శ్మశాన వాటికను సందర్శించి, అక్కడ జరిగే పనులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాజా (అంతిమ యాత్ర)తో వచ్చే కుటుంబ సభ్యులకు ఇబ్బందులు పడకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు యూనుస్, షేక్ అహ్మద్, పార్టీ నాయకులు హకీమ్, గఫ్ఫార్ ఖాన్, ప్రసాద్ పాల్గొన్నారు.



ఖబరస్తాన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

ప్రజలందరికీ గ్రంథాలయ సేవలు

- జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో చైర్మన్ సుభాష్ చంద్రబోస్



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్, తదితరులు

కర్నూలు కల్చరల్: ప్రజలందరికీ గ్రంథాలయాల సేవలు అందిస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం. సుభాష్‌చంద్రబోస్ అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థలో మంళవారం 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. పౌర గ్రంథాలయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ సి. శ్రీనివాసరెడ్డి, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పెద్దక్క జ్యోతి ప్రజ్వలనతో ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు, నిరుద్యోగులకు సంపూర్ణ మెటీరియల్ గ్రంథాలయాల్లో అందుబాటులో ఉందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గ్రామాల్లో డిజిటల్ గ్రంథాలయాలను ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఇప్పటికే గ్రంథాలయాల ఆధునికీకరణకు సీఎం కృషి చేస్తున్నారన్నారు. డీడీ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఎక్కువ మంది పాఠకులు గ్రంథాలయాలను ఉపయోగించుకునేలా అవగాహన కల్పించేందుకే గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రపంచ మధుమేహ దినోత్సవాన్ని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్, కిమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమంతో పాటు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అంతకు ముందు గ్రంథాలయ విశిష్టతను తెలియచేస్తూ గ్రంథాలయం నుంచి తెలుగు తల్లి విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కిమ్స్ వైద్యులు డాక్టర్ గోపీనాథ్, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేజీ గంగాధర్‌రెడ్డి, లైబ్రేరియన్లు వజ్రాల గోవిందరెడ్డి, బాషా, చంద్రమ్మ పాల్గొన్నారు.

- బీక్యాంప్ గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో బీక్యాంప్ బాలికల ఏపీటీడబ్ల్యూఆర్‌ఎస్‌లో గ్రంథాలయ వారోత్సవాలు, బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి పూల మాలల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ గురప్ప, వైస్ ప్రిన్సిపాల్ సలోమి, బీక్యాంప్ గ్రంథాలయ శాఖ అధికారి సంధ్యారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లా జైలు తనిఖీ



ఖైదీల భోజనాన్ని పరిశీలిస్తున్న న్యాయ అధికారి సీహెచ్ నాగశ్రీనివాసరావు

కర్నూలు (లీగల్): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకటనాగ శ్రీనివాసరావు, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎస్.మనోహర్ మంగళవారం పంచలింగాల సమీపంలోని జిల్లా జైలును తనిఖీ చేశారు. ఖైదీల వివరాలను జైలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆహార పదార్థాలను పరిశీలించారు. ఉచిత న్యాయ సేవల గురించి ఖైదీలకు వివరించారు. వారి వెంట జిల్లా జైల్ సూపరింటెండెంట్ ఘనే నాయక్ ఉన్నారు.

షుగర్ ఉన్న విషయమే తెలియదు



మెడికవర్ హాస్పిటల్‌లో మాట్లాడుతున్న డాక్టర్ సరయురెడ్డి

కర్నూలు(హాస్పిటల్): షుగర్ వ్యాధి ఉందన్న విషయమే చాలా మందికి తెలియదని జనరల్ ఫిజీషియన్ డాక్టర్ సరయురెడ్డి చెప్పారు. ప్రపంచ మధుమేహ దినోత్సవాన్ని పురస్కరించుకుని మెడికవర్ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. షుగర్ వ్యాధి సాధారణమైపోయిందని, జీవనశైలి, చెడు అలవాట్ల కారణంగా కూడా ఇది వస్తుందని, ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్థోపెడిక్స్ డాక్టర్ గణేష్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ మంజునాథ్, క్లస్టర్ హెడ్ వై.మహేశ్వరరెడ్డి, సెంటర్ హెడ్ పి. నీలారెడ్డి, ఆపరేషనల్ హెడ్ ఇమ్రాన్ పాల్గొన్నారు.

- కొత్తబస్టాండ్ సమీపంలోని జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్‌లో వరల్డ్ డయాబెటిస్ డే సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. జనరల్ ఫిజీషియన్ డాక్టర్ ఎస్వీ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల పురోగతిపై కలెక్టర్ అసంతృప్తి

కర్నూలు(సెంట్రల్): ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి కనిపించకపోవడంపై కలెక్టర్ డాక్టర్ జి.సృజన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మంగళవారం ఆమె కలెక్టరేట్ నుంచి టెలీ కాన్ఫరెన్స్ ద్వారా ఇళ్ల నిర్మాణాలు, ప్రాధాన్యత భవనాలు, రీసర్వేపై జిల్లా అధికారులు, మండలాల ప్రత్యేకాధికారులు, ఎంపీడీఓలు, ఇతర మండలాధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హాలహర్వి, చిప్పగిరి మండలాల్లోని ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి చాలా తక్కువగా ఉండడంతో రాష్ట్రంలో జిల్లా ర్యాంకు వెనుకబడి పోయిందన్నారు. ఆదోని, గోనెగండ్ల, వెల్దుర్తి, హొళగుంద, చిప్పగిరి, హాలహర్వి, నందవరం, కర్నూలు, గూడూరు, కోడుమూరు, ఆలూరు మండలాల్లో ఆప్షన్- 3 కింద పురోగతి శూన్యమన్నారు. పద్ధతి మార్చుకుని పురోగతి సాధించాలని ఆదేశించారు. టెలీ కాన్ఫరెన్స్‌లో జేసీ నారపురెడ్డి మౌర్య, ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, కర్నూలు, పత్తికొండ ఆర్‌డీఓలు హరిప్రసాదు, రామలక్ష్మి, పీఆర్ ఎస్‌ఈ సుబ్రమణ్యం, డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి, హౌసింగ్ ఇన్‌చార్జ్ పీడీ సిద్ధలింగమూర్తి పాల్గొన్నారు.

వచ్చే నెల 4 నుంచి క్రిస్మస్ సంబరాలు

కర్నూలు (టౌన్): వచ్చే నెల 4 నుంచి క్రిస్మస్ సంబరాలు నిర్వహించనున్నట్లు ఈవాంజికల్ సపోర్టు టీమ్ వ్యవస్థాపకులు దాసరి సుదీర్ తెలిపారు. మంగళవారం రాక్‌వుడ్ చర్చి ప్రాంగణంలో క్రిస్మస్ సంబరాల పోస్టర్లను పాస్టర్ కిషోర్, ప్రోగ్రామ్ కమిటీ చైర్మన్ సురేష్‌బాబుతో కలిసి ఆవిష్కరించారు.

రెజ్లింగ్‌లో కర్నూలుకు పతకాలు

కర్నూలు (టౌన్): ఈనెల 11 నుంచి 13వ తేదీ వరకు విజయవాడలో నిర్వహించిన అంతర్ జిల్లాల రెజ్లింగ్ పోటీల్లో కర్నూలు విద్యార్థులు ప్రతిభ చాటారు. ప్రశాంత్ బంగారు, మనో అర్జున్, జాషువా వెండి, రవికుమార్, రమ్య కాంస్య పతకాలను సాధించారు. వీరిని మంగళవారం స్థానిక జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి కార్యాలయ ప్రాంగణంలో జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి జమీర్ బాషా, ఆర్ఐఓ గురువయ్య శెట్టి, కేవీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ లాలప్ప, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి పద్మావతి అభినందించారు.

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

కర్నూలు(సెంట్రల్): పాలస్తీనాపై ఇజ్రాయెల్ యుద్ధాన్ని ఆపాలని కోరుతూ బుధవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్సాఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎన్ రసూల్ తెలిపారు. నాయకులు అన్వర్‌బాషా, బండి బాషా, ఖాజా భాయ్‌తో కలిసి ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు.

భక్తులకు సౌకర్యాలు కల్పించాలి

కర్నూలు కల్చరల్: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని జిల్లాలోని ఆలయాల్లో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని దేవదాయ శాఖ సహాయ కమీషనర్ ఎం. రామాంజనేయులు అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ క్యూలైన్స్, శానిటేషన్, నీటి వసతి, డెకరేషన్‌ను ఏర్పాటు చేసుకోవాలన్నారు.

కార్తీక మాస పూజలు ప్రారంభం



దేవనగర్‌లోని సత్యనారాయణస్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

కర్నూలు కల్చరల్: కార్తీక మాసం ప్రారంభం కావడంతో నగరంలోని ఆలయాల్లో మహిళలు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. మంగళవారం నగరేశ్వరస్వామి, సప్తగిరినగర్ కైలాసగిరి, అశోక్ నగర్ ప్రసన్నాంజనేయ ద్వారకామాయి, శివరామాలయం, శ్రీరామనగర్ శివాలయం, బుధవారపేట ఈశ్వరాంజనేయస్వామి ఆలయం, మాధవనగర్‌లోని సీతారామాలయం, కొత్తపేటలోని ఈశ్వరాంజనేయ స్వామి ఆలయం, ఓల్డ్‌సిటీ లోని లలితా పీఠం తదితర ప్రాంతాల్లోని ఆలయాల్లో కార్తీక మాస దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించారు.

నగర అభివృద్ధికి సహకరించాలి



చార్జీలు చెల్లిస్తున్న కార్పొరేటర్ విక్రమ సింహారెడ్డి

కర్నూలు (టౌన్): పారిశుధ్య నిర్వహణ, ఇంటింటికి చెత్త సేకరణ చార్జీలు చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని 40 వ వార్డు కార్పొరేటర్ విక్రమసింహారెడ్డి కోరారు. మంగళవారం సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు, స్పెషల్ ఆఫీసర్లు, నగరపాలక ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వరరెడ్డితో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ విక్రమసింహారెడ్డి ఏడాది చార్జీలను చెల్లించారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి ప్రజలు కూడా బాధ్యతగా తీసుకుని చార్జీలు చెల్లించాలని ఆయన కోరారు.

కర్ణాటక మద్యం పట్టివేత

కర్నూలు: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో కర్ణాటక మద్యాన్ని మంగళవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తుగ్గలి మండలం రామలింగాయపల్లె గ్రామానికి చెందిన హరిప్రసాద్ బెంగళూరు నుంచి 296 టెట్రా ప్యాకెట్ల మద్యాన్ని కర్నూలుకు తీసుకువస్తుండగా పక్కా సమాచారంతో నాల్గవ పట్టణ పోలీసులు కొత్తబస్టాండ్‌లో బస్సులను తనిఖీ చేశారు. బెంగళూరు బస్సులో కర్ణాటక మద్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. హరిప్రసాద్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ శంకరయ్య తెలిపారు.

సంక్షిప్తం

21న హిందూ సమ్మేళనం

కర్నూలు కల్చరల్: ఈనెల 21న హిందూ సమ్మేళనం నిర్వహించనున్నట్లు సమరసతా సేవ ఫౌండేషన్ (ఎస్ఎస్ఎఫ్) జిల్లా సంయోజక్ ఎండీవీ జోగయ్య శర్మ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నగర శివారులోని సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఉదయం 8.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతుందన్నారు. శ్రీమఠం హరిహరపురం పీఠాధీశ్వరులు పరమ పూజ్య శ్రీమద్ జగద్గురు శంకరాచార్య ఆశీఃప్రసంగం చేస్తారన్నారు.

ట్రాక్టర్ సీజ్

కర్నూలు (న్యూటౌన్): నంద్యాల జిల్లా డోన్ జాతీయ రహదారిలో అక్రమంగా ఖండపురాయి తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. మంగళవారం ఖండపురాయిని తరలిస్తున్నారని సమాచారం రావడంతో మైనింగ్ అధికారులు దాడి చేసి ట్రాక్టర్‌ను సీజ్ చేసి, రూ.26,675 జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు. తనిఖీల్లో రాయల్టీ ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

17న జిల్లా స్థాయి షూటింగ్ బాల్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): ఈనెల 17న శుక్రవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో జిల్లా స్థాయి షూటింగ్ బాల్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి బి.ఈశ్వర్‌నాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో అండర్-17 అండర్-19 విభాగాల్లో బాల బాలికలకు ఈ పోటీలు ఉంటాయని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెల 9 నుంచి 11వ తేదీ వరకు బాపట్ల జిల్లాలో నిర్వహించనున్న అండర్-19 రాష్ట్ర స్థాయి షూటింగ్‌బాల్ పోటీలలో పాల్గొంటారన్నారు. వివరాలకు 7013886343 సంప్రదించాలన్నారు.

23న సత్యసాయి బాబా జయంతి

కర్నూలు కల్చరల్: భగవాన్ పుట్టపర్తి సత్యసాయి బాబా జయంతి వేడుకలు ఈనెల 23న నెహ్రూ నగర్‌లోని సత్యసాయి మందిరంలో నిర్వహించనున్నట్లు సత్యసాయి సేవాట్రస్ట్ జిల్లాఅధ్యక్షులు మాకా అశోక్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఈఎంటీ ఉద్యోగాలకు నేడు ఇంటర్వ్యూలు

కర్నూలు (హాస్పిటల్): 108 అంబులెన్స్ సర్వీస్‌లో ఈఎంటీ ఉద్యోగాలకు బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సర్వీసెస్ డిస్ట్రిక్ట్ మేనేజర్ నవీన్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ, బీజెడ్సీ, బీ- ఫార్మసీ, డీ-ఫార్మసీ, జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్, డీఎంఎల్‌టీ అర్హత కలిగిన అభ్యర్థులు బయోడేటా, సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీతో ఉదయం 9 గంటలకు ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు.

ఘనంగా జైన్‌ల నూతన సంవత్సర వేడుకలు

కర్నూలు కల్చరల్: స్థానిక ఓల్డ్‌సిటీలోని జైన్ ఆలయంలో జైన్ శ్వేతాంబర్ మూర్తిక్ పూజక్ సంఘ్ ఆధ్వర్యంలో మంగళవారం జైన్‌ల నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. భగవాన్ మహావీర్‌కు, ఆయన ప్రథమ శిష్యుడు గౌతమ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. 108 వెండి కలశాలతో చందన అభిషేకం చేశారు. మహావీర్ జీవించిన 72 ఏళ్లను గుర్తు చేసుకుంటూ నూతన సంవత్సర నేపథ్యంలో లడ్డూను ఊరేగింపుగా తీసుకొచ్చి నైవేద్యంగా సమర్పించారు. జైన్ గురువులు ప్రత్యేక సందేశమిచ్చారు.

బాలల నేస్తం...చాచా నెహ్రూ

కర్నూలు(సెంట్రల్): బాలల నేస్తం పండిట్ జవహర్ లాల్ నెహ్రూ అని కర్నూలు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కె.బాబురావు అన్నారు. మంగళవారం నెహ్రూ జయంతిని పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి మారెప్ప, దామోదరం రాధాకృష్ణ, బతుకన్న తదితరులు పాల్గొన్నారు.

రోగుల చికిత్సలో నర్సుల పాత్ర ప్రధానం



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి

కర్నూలు(హాస్పిటల్): రోగుల చికిత్సలో నర్సుల పాత్ర ప్రధానమైందని పెద్దాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి అన్నారు. ప్రపంచ డయాబెటీస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఆస్పత్రి ఎండోక్రైనాలజీ విభాగం ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీలోని న్యూ లెక్చర్ గ్యాలరీలో షుగర్ వ్యాధిపై నర్సులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుధాకర్, ఎండోక్రైనాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ పి. శ్రీనివాసులు, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రాధారాణి పాల్గొన్నారు.

మరణాల శాతం తగ్గాలి

పెద్దాస్పత్రిలో రోగుల మరణాల శాతం తగ్గాలని సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి ఆదేశించారు. న్యూ లెక్చరర్ గ్యాలరీలో వైద్యులతో మరణాలపై సమీక్ష నిర్వహించారు. రోగులకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని కేస్ షీట్‌లో రాయాలన్నారు. వైద్యపరీక్షల్లో అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్ల సంతకాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. మెడికల్, పల్మనాలజీ విభాగాల కేస్ షీట్లను ప్రైజెంటేషన్ చేశారు.

ఈ-హాస్పిటల్ వంద శాతం అమలు కావాలి

పెద్దాస్పత్రిలో ఈ-హాస్పిటల్ విధానం వంద శాతం అమలు కావాల్సిందేనని సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి ఆదేశించారు. ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో హెచ్‌ఓడీలు, ప్రొఫెసర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ-హాస్పిటల్ విధానాన్ని సైకియాట్రీ, యురాలజీ విభాగాలు వంద శాతం, సర్జికల్ ఆంకాలజీ 92 శాతం, పల్మనలరి మెడిసిన్ 96 శాతం సాధించడం అభినందనీయమన్నారు. మిగిలిన విభాగాలు కూడా లక్ష్యాలను సాధించాలన్నారు. సమావేశంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుధాకర్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాలనాగాంజన్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం



సొసైటీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సుధాకర్

కర్నూలు సిటీ: రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటోందని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. మంగళవారం కర్నూలు మండల పరిధిలోని గార్గేయపురంలో రైతు సహకార కేంద్రం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సహకార సంఘం ద్వారా రుణాలు అందిస్తూ అండగా ఉంటున్నామన్నారు. వ్యవసాయాన్ని లాభపాటిగా మార్చేందుకు ప్రభుత్వం పంటలకు గిట్టుబాటు కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ డి.వెంకటేశ్వరమ్మ, సొసైటీ అధ్యక్షులు వినయ్‌కుమార్ రెడ్డి, ఎల్ల నాగిరెడ్డి, సర్పంచ్ సోమేశ్వరమ్మ, ఉప సర్పంచ్ కౌశిక్ రెడ్డి, జెడ్పీటీసీ ప్రసన్నకుమార్ రెడ్డి, విజిలెన్స్ మానిటరింగ్ సభ్యులు రవిశాస్త్రీ, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు డి.వాసు, గార్గేయపురం మాజీ సర్పంచ్ యేసేపు పాల్గొన్నారు.

అభ్యంతరాలను వంద శాతం పరిష్కరిస్తాం



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కమిషనర్ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్): ఓటర్ల జాబితాపై వచ్చిన అభ్యంతరాలను వంద శాతం పరిష్కరిస్తామని ఎలక్ట్రోరోల్ రిజిస్ట్రేషన్ అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ భార్గవ్‌తేజ అన్నారు. మంగళవారం ఆయన తన చాంబర్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. సమావేశంలో కర్నూలు అర్బన్ తహశీల్దార్ విజయశ్రీ, టౌన్‌ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

- దేశ భవితను తీర్చిదిద్దే బాధ్యత మనందరిపై ఉందని కమిషనర్ భార్గవ్‌తేజ అన్నారు. స్థానిక నగరపాలక కార్యాలయంలో నెహ్రూ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పిల్లలపై ఉన్న వాత్సల్యానికి గుర్తుగా నెహ్రూ ఆయన జయంతిని బాలల దినోత్సవంగా నిర్వహించుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, మేనేజర్ చిన్నరాముడు, రెవెన్యూ అధికారి జునీద్, ఎంటామాలజిస్టు వెంకటేశులు పాల్గొన్నారు.

రోగులకు వైద్యులు అందుబాటులో ఉండాలి



వైద్యులకు సూచనలు చేస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య

కర్నూలు(హాస్పిటల్): ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్యులు అందుబాటులో ఉండి వైద్యం చేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య ఆదేశించారు. మంగళవారం ఆయన నగర శివారులోని ఇ.తాండ్రపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రికార్డులు, రిపోర్టులు పరిశీలించారు. తక్కువగా ఉన్న ప్రోగ్రామ్స్‌ను వంద శాతం పూర్తి చేసి అప్‌లోడ్ చేయాలని వైద్యాధికారులను ఆదేశించారు. అనంతరం పంచలింగాల గ్రామ సచివాలయం-2లో జరుగుతున్న ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రోగ్రామ్‌కు ఎంత మంది రోగులు వచ్చారని అడిగి తెలుసుకున్నారు. వచ్చిన వారందరికీ వైద్యసేవలు అందించాలన్నారు. మధ్యాహ్న సమయంలో వైద్యులు ఆరోగ్యశ్రీ కింద ఆపరేషన్ చేయించుకున్న రోగుల ఇళ్లకు వెళ్లి చికిత్స చేయాలన్నారు. డెంగీ, మలేరియా, చికున్‌గున్యా, ఫైలేరియా వ్యాధులు ప్రబలకుండా దోమల వ్యాప్తిని అరికట్టాలని సూచించారు. గ్రామాల్లో చెత్తదిబ్బలను ఎత్తివేయించాలని, చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించాలని, వారానికి ఒకసారి వాటర్ ట్యాంకులు శుభ్రం చేయాలని సూచించారు.

అన్నదాన ప్రభువే శరణం అయ్యప్ప





మాలధారులతో కలిసి భిక్ష స్వీకరిస్తున్న మేయర్ బీవై రామయ్య, కమిషనర్ భార్గవతేజ తదితరులు

కర్నూలు కల్చరల్: అయ్యప్ప భక్తులకు అన్నదానం చేయడం అభినందనీయమని మేయర్ బీవై రామయ్య అన్నారు. సప్తగిరి నగర్ మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం అయ్యప్ప స్వామి మాలధారణ భక్తులకు అన్నప్రసాద వితరణను నగర పాలక సంస్థ కమిషనర్ భార్గవ తేజ, కమిటీ గౌరవాధ్యక్షులు కేఈ ప్రతాప్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ దాతలు, భక్తుల సహకారంతో 70 రోజుల పాటు అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కైపా పద్మలతా రెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షులు గోపాల్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.